సాక్షి
ప్రకాశం
శనివారం ၊ 11 ၊ మే ၊ 2024



వ్యాపారులపై పగబట్టిన దామచర్ల

ఆర్యవైశ్యులపై దామచర్ల మరోమారు తన పగను ప్రదర్శించారు. నగరంలోని బియ్యం దుకాణాలను తప్పుడు ఆరోపణలతో సీజ్ చేయించారు.

-VIIIలో..



మంచిచేసిన ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

మంచిచేసిన ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కోరారు.

-VIIIలో..

గరిష్ఠం/కనిష్ఠం
37/28

వాతావరణం

ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

ప్రగతి పరుగు..

అభివృద్ధి వెలుగు

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఒంగోలు నగరంపై నిధుల వర్షం కురిపించింది. కనీస మౌలిక వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు నియోజకవర్గ అభివృద్ధిని ప్రతిబింబిస్తున్నాయి. ప్రజలకు ఉచితంగా అధునాతన వైద్యం, విద్యుత్ వ్యవస్థను పటిష్టం చేయడం, తాగునీటి సరఫరాను మెరుగుపరచడం, గృహ నిర్మాణంతోపాటు నగరంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీల అభివృద్ధికి గడిచిన 59 నెలల్లో ప్రభుత్వం రూ.4,485 కోట్లు కేటాయించింది. వివిధ సామాజికవర్గాల చిరకాల స్వప్నమైన ఆరామ క్షేత్రాలు ఏర్పాటు చేయడం, నగర వాసులకు బ్రీతింగ్ స్పేస్ కల్పించేందుకు పార్కులు, వాకింగ్ ట్రాక్‌ల అభివృద్ధికి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చేసిన కృషిపై ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది.



పోతురాజుకాలువ ఆధునికీకరణ పనులు (ఫైల్)

- ఒంగోలు అభివృద్ధిపై వైఎస్సార్ సీపీ మార్క్
- గడిచిన ఐదేళ్లలో నిధులు రూ.4,485 కోట్లు కేటాయింపు
- రూ.వందల కోట్లు వెచ్చించి శాశ్వత అభివృద్ధి పనులు
- రూ.230 కోట్లు వెచ్చించి 25 వేల మందికి ఇళ్ల పట్టాలు
- రూ.298 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్లు, నూతన విద్యుత్ లైన్లు
- సంక్షేమ పథకాల రూపంలో లబ్ధిదారులకు నేరుగా రూ.1,200 కోట్లు
- తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.340 కోట్లు మంజూరు
- వైశ్యులు, బీసీలు, దళితుల సామాజిక భవనాల సమస్య పరిష్కారం

ఒంగోలు సబర్బన్:

ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది. ఒంగోలు నగరంతోపాటు ఒంగోలు రూరల్ మండలం, కొత్తపట్నం మండలాల్లో అభివృద్ధి పనులు చేపట్టడంతోపాటు పేద, మధ్య తరగతి ప్రజలకు సంక్షేమ పథకాల రూపంలో రూ.1200 కోట్లు అందించారు. ఒంగోలు నగరంలో పేదల బ్యాంకు ఖాతాలకు రూ.786.88 కోట్లు, అదేవిధంగా ఒంగోలు రూరల్ మండలం, కొత్తపట్నం మండలాల్లో లబ్ధిదారులకు రూ.413.12 కోట్లు నేరుగా పంపిణీ చేశారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతూ సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి పథకాలు నిర్మించడంలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చూపిన చొరవ ఒంగోలు నగరాన్ని అభివృద్ధి పథంలో ముందుంచింది.

పుష్కలంగా నీరందించేలా..



ఒంగోలు నగరంలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన మంచి నీరు అందించేందుకు రూ.339 కోట్లు కేటాయించిన సీఎం వైఎస్ జగన్ ఇటీవలే పైలాన్ ఆవిష్కరించారు. టెండర్ దశ పూర్తయిన ఈ పనులను ఎన్నికలు ముగిసిన వెంటనే ప్రారంభించేందుకు రంగం సిద్ధమైంది. అమృత్ పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.74 కోట్లు గ్రాంటుగా ఇచ్చి గుండ్లకమ్మ నుంచి పైపులైన్ పనులు పూర్తి చేశారు. రెండు మండలాల్లో జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి ఇచ్చే కార్యక్రమం దాదాపు 90 శాతం పూర్తయింది.

పాఠశాలలకు మహర్దశ



నాడు-నేడు కింద అభివృద్ధి చేసిన బండ్లమిట్ట ప్రాథమిక పాఠశాల

ఒంగోలు నగరంతోపాటు కొత్తపట్నం, ఒంగోలు రూరల్ మండలాల్లో పాఠశాలలను నాడు-నేడు కింద ఆధునికీకరించారు. మొత్తం రూ.21.91 కోట్లతో వివిధ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారు.

సామాజిక ఆకాంక్షలు సాకారం

నగరంలో ప్రముఖుల స్ఫూర్తిని చాటేందుకు మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య, మాజీ ప్రధాని పీవీ నరశింహారావు, కాసు బ్రహ్మానందరెడ్డి విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఒంగోలు నడిబొడ్డున ఉన్న అంబేడ్కర్ భవనాన్ని ఆధునికీకరించారు. నగరంలో రంగారాయుడు చెరువు పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని 20 బీసీ కులాల ఆరామ క్షేత్రాలకు, స్థానిక కరుణాకాలనీలో ఆర్యవైశ్య ఆరామ క్షేత్రానికి స్థలం కేటాయించారు. ఈమనిపాలెంలో హిందూ ఆరామ క్షేత్రం, వెంగముక్కల పాలెంలో కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేశారు. నగర పరిధిలో కమ్యూనిటీ హాళ్లతోపాటు బిలాల్ నగర్‌లో రూ.5.93 కోట్లతో షాదీఖానా నిర్మాణాన్ని చేపట్టారు.

పవర్ ఫుల్‌గా..



అండర్‌గ్రౌండ్ కేబుల్ వర్క్ (ఫైల్)

నియోజకవర్గంలో మడనూరు, రంగాయపాలెం, గుంటూరు రోడ్డు, శ్రీగిరి కొండ, వెంకటేశ్వర కాలనీల్లో సబ్‌స్టేషన్ల నిర్మాణం పూర్తయింది. క్లోపేట, కొప్పోలు, కొత్తపట్నంలో 132 కేవీ సబ్‌స్టేషన్లు దాదాపుగా పూర్తయ్యాయి. అంతే కాకుండా ఒంగోలు, కొత్తపట్నం మండలాల్లో రూ.23 కోట్లతో విద్యుత్ లైన్లు మార్చారు. రూ.4 కోట్లతో స్థానిక మంగమ్మ కాలేజీ ఆవరణలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించారు. నగరంలో ప్రాణాంతకంగా మారిన విద్యుత్ హైటెన్షన్ వైర్లను తొలగించి రూ.65 కోట్లతో భూగర్భ కేబుల్ నిర్మించారు. మొత్తం మీద నియోజకవర్గంలో విద్యుత్ అవసరాల కోసం రూ.298 కోట్ల వరకు వెచ్చించారు.

మౌలిక వసతులకు పెద్దపీట



మురుగునీటి శుద్ధి ప్రాజెక్టు

- ఒంగోలు నగరంలో రూ.62.79 కోట్లతో సీసీ రోడ్లు, రూ.2.50 కోట్లతో డివైడర్లు, రూ.6.20 కోట్లతో హైమాస్ట్ లైటింగ్ ఏర్పాటు చేశారు. ఒంగోలు రూరల్, కొత్తపట్నం మండలాల్లో రూ.15 కోట్లతో ఇంటర్నల్ సీసీ రోడ్లు, రూ.20 కోట్లతో లింకు రోడ్లు అభివృద్ధి చేశారు. రూ.80 లక్షలతో రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టారు. చేజర్ల-ముదిగొండవాగు-అల్లూరు రోడ్డులో రూ.15 కోట్లతో రెండు వంతెనల పనుల ప్రారంభానికి ఏర్పాట్లు చేశారు.
- నగరంలో రూ.42.71 కోట్లతో డ్రైనేజీల నిర్మాణం పూర్తి చేశారు. పోతురాజు కాలువ పనులకు ఇప్పటి వరకు రూ.58 కోట్లకు పైగా ఖర్చు చేశారు. కొప్పోలు సమీపంలో రూ.30.79 కోట్లతో మురుగునీటి శుద్ధి కర్మాగారం నిర్మించారు.
- రూ.28.83 కోట్ల వ్యయంతో గ్యాస్ క్రిమిటోరియం ఏర్పాటు చేశారు. నగరపాలక సంస్థ పరిధిలో రూ.70 కోట్ల విలువైన పనులు వివిధ దశల్లో ఉన్నాయి.
- కొత్తపట్నం సముద్ర తీరంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కోసం రూ.399 కోట్లు కేటాయించారు. టెండర్ ప్రక్రియ కూడా పూర్తయింది. పనులు చేపట్టడమే తరువాయి.

అధునాతన వైద్యం



రిమ్స్‌లో సి.టి. స్కాన్ మిషన్ ప్రారంభిస్తున్న బాలినేని

ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు జీజీహెచ్(రిమ్స్)లో వసతులు కల్పించారు. జీజీహెచ్‌లో దాదాపు రూ.10 కోట్లతో ఎంఆర్‌ఐ, సీటీ స్కాన్ మెషీన్లు ఏర్పాటు చేశారు. రూ.50 కోట్లతో మెడికల్ కాలేజీ అదనపు భవన నిర్మాణ పనులు చేపట్టారు. పేర్నమిట్ట సమీపంలోని పీర్లమాన్యం, రాజీవ్ గృహకల్ప కాలనీ, త్రోవగుంట, గద్దలగుంట, మదర్ థెరిసా కాలనీల్లో అర్బన్ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేశారు. విపత్కర పరిస్థితులు అధిగమించేలా రూ.40 కోట్లతో ఆక్సిజన్ లైన్లు, అధునాతన ఐసీయూ బ్లాక్స్, చిన్నపిల్లలకు అవసరమైన ఎన్ఎస్ఐసీయూ ఏర్పాటు చేశారు. కొత్తపట్నం, కరవది, ఈతముక్కల పీహెచ్‌సీలను రూ.1.20 కోట్లతో ఆధునికీకరించింది. ఇక కోవిడ్ సమయంలో బాలినేని సొంతంగా 100 పడకలతో కోవిడ్ కేర్ సెంటర్ ఏర్పాటుతోపాటు రోగులకు ఆక్సిజన్, పౌష్టికాహారం ఉచితంగా అందించారు.

గూడు గోడు తీరేలా..

నియోజకవర్గంలో నివేశన స్థలాలకు అర్హులైన పేదలు 30 వేల మందికిపైగా ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. ముఖ్యంగా ఒంగోలు నగరంలో రూ.230 కోట్లు వెచ్చించి ప్రైవేట్ భూములు సేకరించి 20,840 మంది పేదలకు ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ చేసి అందించారు. మరో 4 వేల మందికి స్థలాలు అందించేందుకు దరఖాస్తులు స్వీకరించారు. ఆ స్థలాల్లో పేదలు ఇళ్లు కట్టుకునేందుకు రాయితీ కింద రూ.1100 కోట్లు మంజూరు చేశారు. ఈ లేఔట్‌లో తాగునీటి పైపులైన్ల కోసం మరో రూ.230 కోట్లు మంజూరయ్యాయి.



పేదలకు ఇళ్ల స్థలాలిచ్చిన అగ్రహారం లేఔట్

న్యూస్‌రీల్

స్ట్రాంగ్ రూములను పరిశీలించిన కలెక్టర్



ఒంగోలు అర్బన్: స్థానిక రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన ఎన్నికల స్ట్రాంగ్ రూమ్‌ను శుక్రవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పరిశీలించారు. జిల్లాలోని మొత్తం నియోజకవర్గాలకు సంబంధించి స్ట్రాంగ్ రూము, కౌంటింగ్ కేంద్రం ఇక్కడే ఏర్పాటు చేస్తుండటంతో పక్కాగా ఏర్పాట్లు, భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. కొండపి నియోజకవర్గానికి డిస్ట్రిబ్యూషన్ కేంద్రం కూడా ఇక్కడే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాహనాల పార్కింగ్, సిబ్బంది రాకపోకల క్రమబద్ధీకరణ, ప్రత్యేక బారికేడ్‌లు, సూచనలు చేస్తూ సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్‌తోపాటు డీఆర్‌ఓ శ్రీలత, ఇతర అధికారులు ఉన్నారు

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

- వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి

యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని గత ఐదేళ్ల పాలనలో ప్రజలు గుర్తించారని ఒంగోలు పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు, సచివాలయాల కన్వీనర్లతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో వైజాగ్‌లో స్వదేశీ, విదేశీ పారిశ్రామిక దిగ్గజాలను రప్పించి సెమినార్‌లు నిర్వహించారని, అనేక మంది పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారని, దీని వలన వేలాదిమంది యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించవచ్చని చెప్పారు. నవరత్నాల పథకాలు అమలు పరచి పేద ప్రజలకు ఎంతో మేలు చేశారని, మహిళలకు ప్రాధాన్యత ఇచ్చి ప్రతి పథకం వారికి దక్కేలా చర్యలు తీసుకున్నారని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి నడిచే అవకాశం తమకు దక్కిందని, ఆయన ఆదేశాల మేరకే తాను ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా, నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా తాటిపర్తి చంద్రశేఖర్ పోటీ చేస్తున్నామన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని కోరారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసేలా ప్రతి ఒక్క కార్యకర్త ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని ఆయన కోరారు. 2019లో జరిగిన ఎన్నికల్లో వచ్చిన మెజార్టీ కంటే ఎక్కువ వచ్చేలా కష్టపడాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్, ఎన్నికల అబ్జర్వర్ వెన్నా హనుమారెడ్డి, ఇరిగేషన్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దుగ్గెంపూడి వెంకటరెడ్డి, పెద్దారవీడు మండల జెడ్పీటీసీ యేర్వ చలమారెడ్డి పాల్గొన్నారు.

బాబు సభ అట్టర్ ఫ్లాప్

- జనాలు లేక రెండు గంటలు ఆలస్యంగా రోడ్ షో
- జనాలు లేకపోవటంతో దామచర్ల, మాగుంటలపై బాబు సీరియస్
- తొలుత అద్దంకి బస్టాండ్ అని ప్రకటన..
- జనం రారని వేదిక ఇరుకుగా ఉండే మిరియాలపాలెం సెంటర్‌కు మార్పు



మిరియాలపాలెం సెంటర్‌లో రాత్రి 8 గంటలకు ఇలా..



జనం లేక వెలవెలబోతున్న బాబు సభ

సాక్షిప్రతినిధి, ఒంగోలు: ఒంగోలు నగరంలో పోలింగ్‌కు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రోడ్ షో, సభ అట్టర్‌ఫ్లాప్ అయ్యాయి. పోలింగ్‌కు కేవలం రెండు రోజుల ముందు టీడీపీ అధినేతే స్వయంగా నిర్వహించిన సభకు జనాల నుంచి కనీస స్పందన లేకపోవడం పార్టీ కేడర్‌ను కలవరపెట్టింది. బాబు పర్యటనను విజయవంతం చేయాలని రెండు రోజుల నుంచి టీడీపీ నాయకులు కష్టపడినా జనాలు రాకపోవడం గమనార్హం. తొలుత శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు నగరంలో రోడ్‌షో ఉంటుందని ప్రకటించారు. ఆమేరకు 6 గంటలకు ఒంగోలు పీటీసీలో హెలికాప్టర్‌లో ల్యాండ్ అయ్యారు. అక్కడి నుంచి రోడ్‌షో నిర్వహించాల్సి ఉండగా.. జనం లేక ఉత్తర బైపాస్‌లో ఉన్న బృందావన్ గార్డెన్స్‌కు రోడ్డు మార్గంలో వెళ్లిపోయారు. చివరకు రాత్రి 8 గంటలకు రోడ్‌షో ప్రారంభించారు. అయినా జనంలేక వెలవెలబోయింది. తొలుత అద్దంకి బస్టాండ్ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద సభ ఏర్పాటు చేస్తారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దామచర్ల జనార్దన్ ప్రకటించారు. అక్కడ విస్తీర్ణం ఎక్కువగా ఉండటంతో జనాలు రాకపోతే పరువు పోతుందని భావించి హుటాహుటిన ఇరుకుగా ఉండే మిరియాలపాలెం సెంటర్‌కు సభను మార్చారు. నగరంలో ప్రధానమైన ట్రంకు రోడ్డులోని మిరియాలపాలెం సెంటర్‌లో సభ పెట్టడంతో ఆ మార్గంలో వెళ్లే జనాలు నానా అవస్థలు పడ్డారు. సాయంత్రం 6 గంటల నుంచే పోలీసులు ఆరోడ్డును బ్లాక్ చేశారు. జనాలు లేక కార్యక్రమం ఆలస్యం చేయడంతో రాత్రి 9 గంటల వరకు జనాలకు ఇక్కట్లు తప్పలేదు. జనాలు రాక కార్యక్రమం ఆలస్యం కావటంతో ఒంగోలు టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి దామచర్ల జనార్దన్‌ను, పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులు రెడ్డిలపై చంద్రబాబు తీవ్రంగా ఆగ్రహించినట్లు విశ్వసనీయ సమాచారం. బృందావన్ గార్డెన్స్‌కు పలిపించుకొని అక్షింతలు వేసినట్లు పార్టీ నాయకులే గుసగుసలాడుకుంటున్నారు.

చెప్పిన అబద్ధాలు పదే పదే..

చెప్పిన అబద్ధాలు పదే పదే చెప్పి సభకు వచ్చిన పార్టీ కేడర్‌కు, ప్రజలకు చంద్రబాబు బోర్ కొట్టించారు. దశాబ్దాలుగా చెబుతూ వస్తున్న ఎస్సీ వర్గీకరణ అధికారంలోకి రాగానే చేస్తానని మరోసారి నమ్మ బలికారు. అదేవిధంగా రజకులను ఎస్సీల్లో చేరుస్తానని మళ్లీ చెప్పారు. గతంలో జరిగిన ఎన్నికల్లో రెండు మూడు దఫాలు చెప్పి రజకులను నిలువునా మోసం చేశారు. స్థాయి దిగజార్చుకొని మరీ బాలినేనిని విమర్శించారు. పోస్టల్ బ్యాలెట్లలో పార్టీకి వ్యతిరేకంగా ఓట్లు వేసినట్లు కొంత అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు తాను చాలా చేశానని పోస్టల్ బ్యాలెట్లలో పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేశారంటూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. చంద్రబాబు మాట్లాడుతూ ఉండగానే సొంత పార్టీ కార్యకర్తలు, నాయకులు వెళ్లిపోయారు. సభలో ఎవరూ లేకున్నా టీవీల్లో లైవ్ ప్రోగ్రాముల కోసం చంద్రబాబు 30 నిమిషాలు మాట్లాడాడు.

క్లుప్తంగా

బలిజ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వినతి



సజ్జల రామకృష్ణారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న కూనపరెడ్డి శివశంకరరావు

ఒంగోలు: ప్రస్తుత ఎన్నికల్లో బలిజల మద్దతు వైఎస్సార్ సీపీకే అని ఏపీ బలిజ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కూనపరెడ్డి శివశంకరరావు స్పష్టం చేశారు. శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిశారు. రాష్ట్రంలో బలిజ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. కార్పొరేషన్ ఆవశ్యకత గురించి వివరించారు. సజ్జల రామకృష్ణారెడ్డి సానుకూలంగా స్పందించడం ఆనందంగా ఉందని, తప్పకుండా బలిజల ఆకాంక్ష తీరే రోజు అతి త్వరలోనే ఉందని శివశంకరరావు తెలిపారు.

ట్రాక్టర్ పైనుంచి పడి కూలి మృతి



రాజ్యలక్ష్మి మృతదేహం

తాళ్లూరు(ముండ్లమూరు): మండలంలోని బొద్దికూరపాడు గ్రామ సమీపంలో మిరపకోత కూలీల ట్రాక్టర్‌పై నుండి పడి గడ్డం రాజ్యలక్ష్మి (38) అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు... గుంటూరు జిల్లా వెల్దుర్తి మండలం మందాది గ్రామానికి చెందిన పలువురు కూలీలు మిరప కోత కొరకు వచ్చి గ్రామంలో ఉంటున్నారు. శుక్రవారం మిరప కోత పనులకు వెళ్తుండగా మార్గమధ్యంలో ట్రాక్టర్ డోర్ ఊడి పడడంతో ట్రాక్టర్ డోర్ పక్కనే కూరున్న గడ్డం రాజ్యలక్ష్మి ప్రమాదవశాత్తు కిందపడింది. దీంతో ట్రాక్టర్ టైర్ ఆమె భుజంపైకి ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి స్వగ్రామం బొద్దికూరపాడు. మృతురాలికి భర్త, ముగ్గురు ఆడ పిల్లలు, మగ పిల్లాడు ఉన్నారు. భర్త ధామస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వైవీ రమణయ్య తెలిపారు.

మంచి చేసిన ప్రభుత్వాన్ని ఆదరించండి

- 48, 49 డివిజన్‌ల ప్రచారంలో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి



48వ డివిజన్ దిబ్బలరోడ్డులో ఎన్నికల ప్రచారంలో బాలినేని, ఇతర నేతలు

ఒంగోలు సెంట్రల్: మంచి చేసిన ప్రభుత్వాన్ని మరోమారు ఆదరించాలని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి కోరారు. పట్టణంలోని 48, 49 డివిజన్‌లలో శుక్రవారం మన ఒంగోలు-మన వాసన్న కార్యక్రమంలో భాగంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఒంగోలు నియోజకవర్గంలో గత ఐదేళ్లలో రూ.4485 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. ప్రజలకు ప్రతి ఇంటికీ ప్రతి రోజు నీరు అందించేందుకు చర్యలు చేపట్టామని, అక్కా చెల్లెమ్మలకు స్వంత ఇంటి కల సాకారం చేసేందుకు రూ.231 కోట్లు వెచ్చించి 20 వేల పట్టాలు అందించామని, రాబోవు 9 నెలల్లో ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పారు. ప్రతి కులానికి ఆరామ క్షేత్రాలు ఏర్పాటు చేసి అభివృద్ధి చేశామన్నారు. రూ.298 కోట్లతో విద్యుత్ పనులు చేపట్టామని, ఒంగోలు పట్టణంలో 20 పార్కులు అభివృద్ధి చేశామని, ఒంగోలు పట్టణంలో రోడ్లు, కాలువలు అభివృద్ధి చేశామన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజి ఏర్పాటు చేయటానికి కృషి చేస్తామని చెప్పారు. నియోజకవర్గంలో మేజర్ రోడ్లు అభివృద్ధి చేశామని, ఒంగోలు, కొత్తపట్నం మండలాల్లో అంతర్గత రోడ్లు అభివృద్ధి చేశామని, కమ్యూనిటీ భవనాలు, ప్రభుత్వ భవనాలు నిర్మించామని, నాడు-నేడుతో పాఠశాల ఆధునికీకరణ చేయించామని, ఫిషింగ్ హార్బర్ నిర్మాణం చేపట్టామని తెలిపారు. మరింత సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు సాగటానికి ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి అమూల్యమైన ఓటును వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ 48వ డివిజన్‌లో నుంచి డివిజన్ ఇన్‌చార్జిలు పిడుగు వెంకట శేషిరెడ్డి, కోఆర్డినేటర్ నరేంద్ర రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు వీరభద్రరావు, ఉన్నం జనార్దన్, మాధవ, హనుమా, నాగరాజు, బాదులు, వెంకటేష్, రాము, మధు, నాగేశ్వరరావు, సుధాకర్, రాఘవయ్య, జాణా శ్రీను, గురువా రెడ్డి, స్టీఫెన్, జానీ, చిరంజీవి, కొప్పోలు వెంకటేశ్వర్లు, జ్యోతి, మాధవి, మల్లేశ్వరి, ఉషా, శేషమ్మ, అంజమ్మ, రమణమ్మ, మాధవి, శ్రీదేవి, విజయలక్ష్మి, అనురాధ, ఉష, టీ శేషమ్మ, మల్లేశ్వరి, గృహలక్ష్మి, వాకా బ్రహ్మరెడ్డి, డేవిడ్, పీ శ్రీను, రామకృష్ణా రెడ్డి, సత్తి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. 49వ డివిజన్ నుంచి కార్పొరేటర్ అంగిరేకుల గురవయ్య, ఇన్‌చార్జ్ తాళ్లపాలెం శ్రీనివాసరావు, డివిజన్ అధ్యక్షుడు గాలం సుబ్బారావు, నాయకులు కసిబిసి నాగేశ్వరరావు, కందూరి పుల్లారెడ్డి, సూరసారి సర్వా రెడ్డి, బత్తుల కాశయ్య, ఢాకా రాఘవ రెడ్డి, బలరామ్ కృష్ణ యాదవ్, గోపిదేశి నాగేశ్వరరావు, వీరనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, దిలీప్ కుమార్, హరి, అంగిరేకుల బాల గురవయ్య, మల్లిఖార్జున్, జయరాం, షేక్ గౌస్ నాయబ్‌రసూల్, అంగిరేకుల నాగేశ్వరరావు, కుర్ర గురుసత్యం, మళ్లిబోయిన వెంకటేష్, కసిబిసి వీర బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

పథకాల నగదును చంద్రబాబే ఆపించారు

- ప్రజలు గమనించి ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీకి గుణపాఠం చెప్పాలి
- వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలి
- ఎన్నికల ప్రచారంలో మంత్రి మేరుగు నాగార్జున



దొడ్డవరంలో ఎన్నికల ప్రచారంలో మంత్రి మేరుగు

మద్దిపాడు: ఐదేళ్లుగా రాష్ట్ర ప్రజలకు దేశంలోనే కనీవినీ ఎరుగని స్థాయిలో సంక్షేమ పథకాలు అందిస్తూ విశేషంగా ప్రజాభిమానాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూరగొన్నారని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు. పథకాలకు సంబంధించిన నిధులు కూడా లబ్ధిదారులైన ప్రజల బ్యాంకు ఖాతాలకు జమకావాల్సి ఉందని, ఓటమి భయంతో చంద్రబాబు ఆ నిధులు జమవకుండా ఫిర్యాదులు చేయించి అడ్డుకుని పేదల ఉసురుపోసుకుంటున్నారని మండిపడ్డారు. మద్దిపాడు మండలంలోని తెల్లబాడు, దొడ్డవరం గ్రామాల్లో శుక్రవారం రాత్రి మేరుగు నాగార్జున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాల నుంచి ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు ఎన్నికల సమయంలో నిలిచిపోవడానికి చంద్రబాబే కారణమన్నారు. గత రెండు నెలలుగా అవ్వాతాతల పెన్షన్లు వలంటీర్లతో పంచనీయకుండా బ్యాంకులకు జమ చేయించి ఎంతోమందిని ఎండలో అవస్థపెట్టిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని మేరుగు మండిపడ్డారు. ఎండదెబ్బకు రాష్ట్ర వ్యాప్తంగా అవ్వాతాతలు 70 మందికిపైగా పెన్షన్ల కోసం బయటకు వెళ్లి చనిపోయారని, వారి ఉసురు చంద్రబాబుకు తగిలి తీరుతుందని శపించారు. అమ్మ ఒడి ఒక్కరికి ఇస్తేనే ఆంధ్రప్రదేశ్ శ్రీలంక అయిపోతుందంటూ గగ్గోలు పెట్టిన చంద్రబాబు.. ప్రస్తుతం ఒకే ఇంట్లో ఎంతమందికైనా ఇస్తామని, రూ.1.25 లక్షల కోట్ల సంపద సృష్టిస్తానని అధికారం కోసం అడ్డదారులు తొక్కాలనుకోవడాన్ని మేరుగు ఎద్దేవా చేశారు. డబ్బు, మద్యం ఏరులై పారిస్తున్నారని, అయినా అతనికి గెలుపుపై నమ్మకం లేకపోవడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై తీవ్రంగా విరుచుకుపడుతూ పథకాల నగదు నిలిపివేయిస్తూ కుట్రలు పన్నుతున్నారని ధ్వజమెత్తారు. ఎవరు ఎన్ని రకాలుగా ప్రయత్నించినా ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డివైపే ఉన్నారని తెలిపారు. తనను సంతనూతలపాడు ఎమ్మెల్యేగా, నందిగం సురేష్‌ను బాపట్ల ఎంపీగా ఫ్యాన్ గుర్తుకు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, ప్రధాన కార్యదర్శి, ఎంపీటీసీ వాకా కోటిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ పైడిపాటి వెంకట్రావు, మాజీ ఎంపీపీ నారా విజయలక్ష్మి, మందా చిన్న, బొమ్మల దేవదాసు, గుడ్డపాతల రవి, పణతుల వెంకట సుబ్బారావు, వడ్డెంపూడి సుబ్బారావు, వల్లెపు వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, నాదెండ్ల మహేష్, ఎంపీటీసీ మేరిగ పద్మ, అభిమానులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

అరాచకం సృష్టించాలని చూస్తున్నారు

- కడియాల రమేష్ అనే వ్యక్తి 150 మంది రౌడీలను దర్శిలో దించారు
- అతనిపై అనేక కేసులున్నాయి
- పోలింగ్ రోజు అల్లర్లు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలి
- ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలి
- జగనన్న పాలనపై ప్రజలకు నమ్మకం ఉంది
- వైఎస్సార్ సీపీ దర్శి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: ప్రశాంతంగా ఉండే దర్శి పట్టణం, నియోజకవర్గంలో ఎన్నికల పోలింగ్ రోజు అరాచకాలు సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేందుకు టీడీపీ దర్శి ఎమ్మెల్యే అభ్యర్థికి సంబంధించిన వ్యక్తులు కుట్ర పన్నారని వైఎస్సార్ సీపీ దర్శి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం తన తల్లి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కడియాల రమేష్ అనే వ్యక్తి 150 మందికిపైగా రౌడీలు, అరాచక శక్తులను దర్శి తీసుకొచ్చి అరాచకాలు సృష్టించాలని చూస్తున్నారన్నారు. రమేష్‌పై అనేక కేసులున్నాయంటూ ఆ కేసుల వివరాలను బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి చదివి వినిపించారు. స్థానిక పోలీసులు సకాలంలో స్పందించి పకడ్బందీగా తగిన చర్యలు తీసుకోకపోతే ప్రశాంతమైన దర్శిలో అరాచకం సృష్టించే అవకాశం ఉందని చెప్పారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు పోలీస్ శాఖ పటిష్ట చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీఎం వైఎస్ జగన్ పాలనపై ప్రజలు ఎంతో నమ్మకంతో ఉన్నారని చెప్పారు. కరోనా కష్టకాలంలో కూడా ఆ కష్టాలను మరిపించేలా ప్రజలకు ఎటువంటి లోటు తలెత్తకుండా సంక్షేమ పథకాలు అందించిన గొప్ప ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఒకసారి నమ్మితే జగన్ అంటే ఎంటో ప్రజలకు చూపించారన్నారు. ఊహించని స్థాయిలో సంక్షేమం, అభివృద్ధి చేసి చూపించడం దేశంలో ఒక్క జగనన్నకే సాధ్యమైందన్నారు. మళ్లీ జగనన్న సీఎం అయిన వెంటనే అందించే సంక్షేమం, అభివృద్ధి ఫలాలు ప్రజలు ఊహించలేనంత గొప్పగా ఉంటాయని చెప్పారు. ఇప్పటికే జగనన్న ఇచ్చిన పథకాలు ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి మేలు చేశాయన్నారు. సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, కార్పొరేట్ స్థాయిలో పాఠశాలలు, ఇంగ్లిషు మీడియం చదువులు, పథకాలు గ్రామంలో పేదలకు అండగా నిలిచాయని బూచేపల్లి వివరించారు. జగనన్నకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక టీడీపీ కూటమి కుట్ర రాజకీయాలు చేయాలని చూస్తోందని చెప్పారు. కూటమి అబద్ధాల హామీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని స్పష్టం చేశారు. ప్రజలంతా మళ్లీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంని చూసేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని తెలిపారు. 2014 ఎన్నికల్లో 600కుపైగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కటి కూడా పూర్తిగా అమలు చేయని వ్యక్తి చంద్రబాబు అని వివరించారు. ఐదేళ్లపాటు చంద్రబాబు పాలనకు ప్రజలు విసిగి వేసాగిపోయారని అన్నారు. 2019 ఎన్నికల్లో 151 సీట్లతో వైఎస్సార్ సీపీని గెలిపించడమే అందుకు నిదర్శనమని అన్నారు. ఈసారి కూడా చంద్రబాబు అబద్ధపు హామీలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని స్పష్టం చేశారు.

మా హయాంలో నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి...

తమ హయాంలో దర్శి నియోజకవర్గంలో అనేక సబ్‌స్టేషన్లు, బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, తాగునీటి ప్రాజెక్టులు నిర్మించి ప్రజలకు మేలు చేశామని బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. దర్శి మున్సిపాలిటీలో తాగునీటి కోసం రూ.120 కోట్ల టెండర్లు పూర్తయ్యాయన్నారు. మొగిలిగుండాల చెరువును కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల సీఎం ఎన్నికల ప్రచారంలో దర్శికి వచ్చినప్పుడు ప్రజల కోరిక మేరకు నియోజకవర్గంలో చెరువులను సాగర్ జలాలతో నింపుతామని చెప్పారన్నారు. అలాగే ఈ ప్రాంతంలో ఇండస్ట్రీలు, ఐటీ కంపెనీలు తామే స్థాపించి ఇక్కడి ప్రజలకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు చేస్తున్నామని చెప్పారు. నియోజకవర్గ ప్రజలంతా తమ కుటుంబాన్ని 20 ఏళ్లుగా ఆదరిస్తున్నారని, ఎటువంటి అవినీతి మచ్చ లేకుండా మాకు చేతనైన సాయం చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఒంగోలు ఎంపీగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ షకీలా అమీన్ బాషా, ఎంపీపీ సుధాఅచ్చయ్య, ముండ్లమూరు జేసీఎస్ కన్వీనర్ మేడికొండ జయంతి, మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కట్టికోట హరీష్, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం పాల్గొన్నారు.

వ్యాపారులపై పగబట్టిన దామచర్ల



అధికారుల తీరుకు నిరసనగా ఆందోళన చేస్తున్న కుప్పం ప్రసాద్, ఆర్యవైశ్యులు

- 120 ఏళ్లుగా విశ్వాసాన్ని చూరగొన్న వ్యాపార సంస్థపై ఫిర్యాదులు
- విచారణ చేయకుండానే సీజ్ చేసిన అధికారి
- ఆర్యవైశ్యుల ఆగ్రహంతో తిరిగి తెరిపించిన సబ్ కలెక్టర్
- దామచర్ల వైఖరిని ఖండించిన ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్

ఒంగోలు సాక్షిప్రతినిధి: ఆర్యవైశ్యులపై దామచర్ల మరోసారి తన ప్రగుసు ప్రదర్శించారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం ఎదురుగా ఏళ్ల తరబడి నిర్వహిస్తున్న బియ్యం దుకాణంపై తప్పుడు ఆరోపణలు సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో దుకాణం వద్దకు చేరుకున్న అధికారులు దుకాణంలో బియ్యం కోసం వచ్చిన వారి వద్ద, దుకాణ యజమాని వద్ద రూ.50 నోట్లను పరిశీలించారు. తమ వద్ద బస్తా బియ్యం రూ.1450 అని, రూ.1500 ఇచ్చిన వారికి రూ.50 ఇచ్చినట్లు వ్యాపారి వివరణ ఇచ్చారు. అయినా సదరు అధికారి ఏమాత్రం వినకుండా షాపును సీజ్ చేయాల్సిందేనంటూ పట్టుబట్టారు. దీనిపై దుకాణ యజమాని తాము బ్యాంకుల నుంచి తెచ్చుకున్న నోట్లని చెప్పినా వినకుండా సీజ్ చేశారు. విషయం తెలుసుకున్న ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకొని వ్యాపారులపై దాడులు ఏంటంటూ మండిపడ్డారు. అధికారుల తీరుకు నిరసనగా ధర్నా చేపట్టారు. ఏళ్ల తరబడి నమ్మకంగా బియ్యం విక్రయిస్తున్న దుకాణమని, ఎవరో తప్పుడు ఫిర్యాదు చేస్తే సీజ్ చేస్తారా అంటూ ప్రశ్నించారు. దీంతో సబ్ కలెక్టర్ అక్కడకు చేరుకొని విచారించి షాపును తెరిపించారు. లభించిన ఆధారాల ప్రకారం దర్యాప్తు చేస్తామని, దుకాణాన్ని సీజ్ చేయాల్సిన అవసరం లేదని వెళ్లిపోయారు.

వ్యాపారులపై మరో మారు అక్కసు: కుప్పం ప్రసాద్

దామచర్ల జనార్దన్‌కు ఆర్యవైశ్యులంటే ఎంతో కడుపుమంటని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ మండిపడ్డారు. ఎన్నో ఏళ్లుగా వ్యాపారం చేసుకుంటున్న వారిపై తప్పుడు ఫిర్యాదు చేసి వ్యాపార వర్గాలను బెంబేలెత్తించాలని చూస్తే ఊరుకోమన్నారు. వినియోగదారులు బియ్యం కొనుగోలు చేస్తే వారికి వైఎస్సార్ సీపీ ఉచితంగా ఇచ్చినట్లా అంటూ మండిపడ్డారు. పార్టీలకు అతీతంగా వ్యాపారులంతా ఐక్యం కావడం వల్లే దాడిని సమర్థవంతంగా ఎదుర్కొగలిగామన్నారు. బాలినేని తన రాజకీయ జీవితంలో ఏనాడు వ్యాపారులపై దాడులు చేయించడం కానీ, బెదిరించడం కానీ చేయలేదన్నారు.

వ్యాపారులపై కొనసాగుతున్న నిఘా..

వ్యాపారులపై టీడీపీ నిఘా పెట్టింది. ఏమాత్రం అనుమానం వచ్చినా సీవిజిల్ యాప్‌లో పెట్టాలంటూ దామచర్ల సూచించినట్లు సమాచారం. దీంతో పచ్చ బ్యాచ్ రెచ్చిపోయి ఇటువంటి కుట్రలకు పాల్పడుతున్నారు. ఇప్పటికే రైస్ మిల్లులు మొదలు పలు వ్యాపార సంస్థలపై ఎన్నికల ఫండ్ ఇవ్వాలంటూ ఒత్తిడి తెస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వారు అందుకు అంగీకరించకపోతుండడంతోనే ఇటువంటి దాడులు చేయిస్తున్నారనే వాదన వినిపిస్తోంది.

జగనన్న పంపిన సేవకుడిని



ఎన్నికల ప్రచారంలో అభివాదం చేస్తున్న అన్నా రాంబాబు, పక్కన జంకె వెంకటరెడ్డి తదితరులు



ప్రచారంలో భాగంగా పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ

- మార్కాపురం అభ్యర్థి అన్నా రాంబాబు
- వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ

మార్కాపురం: జగనన్న పంపిన ఆదేశాల మేరకు తాను మార్కాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డి పోటీ చేస్తున్నారని, రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి సంక్షేమ ప్రభుత్వానికి రెండోసారి మద్దతు తెలపాలని ఎమ్మెల్యే అన్నా రాంబాబు కోరారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో స్థానిక ఎల్వీ ప్రసాద్ వైద్యశాల నుంచి పూలసుబ్బయ్య కాలనీ, కోర్టు సెంటర్, కంభం రోడ్డు, దోర్నాల సెంటర్ మీదుగా సెవెన్ హిల్స్ వరకు శుక్రవారం సాయంత్రం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఏపీఐఐసీ చైర్మన్ జంకె వెంకటరెడ్డి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షంషేర్ ఆలీబేగ్, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్పొరేషన్ డైరెక్టర్లు, మైనార్టీ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు మాట్లాడుతూ మీకు సేవ చేసే అదృష్టం తనకు కల్పించాలని కోరారు. మార్కాపురం నియోజకవర్గ ఓటర్లు కులం కాకుండా గుణం చూడాలన్నారు. రౌడీయిజం కావాలో.. ప్రజలు భయభ్రాంతులకు గురిచేసే వారు కావాలో.. మీ ఆస్తులకు రక్షణ కల్పించే వారు కావాలో.. మంచి వ్యక్తిత్వం కల వారు కావాలో.. మార్కాపురం ఓటర్లు నిర్ణయించుకుని ఫ్యాన్ గుర్తుపై ఓటేయాలని అన్నా రాంబాబు విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ విజ్ఞతతో ఆలోచించాలని, సోమవారం జరిగే ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్‌ను నిర్ణయిస్తాయన్నారు. కరోనా సమయంలో కూడా పథకాలు ఇంటింటికీ చేర్చి ప్రజల ఆర్థిక ఇబ్బందులను తొలగించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. తనకు వ్యాపారాలు, వ్యాపకాలు లేవని, మార్కాపురం అభివృద్ధి పైనే తన దృష్టి అన్నారు. తరుచూ టీడీపీ అభ్యర్థి ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని, పదవికోసమే చనిపోతానంటూ ప్రచారం చేయడం మంచి సాంప్రదాయం కాదన్నారు. చంద్రబాబు హామీలు నీటిమూటలన్నారు. ప్రజలు నమ్మరని తెలిసినా రకరకాల పథకాలు ప్రకటించారన్నారు. 2014లో ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలు చేశాడో గుర్తు తెచ్చుకోవాలన్నారు. ఏపీఐఐసీ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థిగా అన్నా రాంబాబును గెలిపించాలని కోరారు. ర్యాలీతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సత్తా చాటారు. జై జగన్.. జై చెవిరెడ్డి, జై అన్నా రాంబాబు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పీఎల్పీ యాదవ్, ఏఎంసీ మాజీ చైర్మన్లు గుంటక సుబ్బారెడ్డి, జి. శ్రీనివాస రెడ్డి, వైస్ చైర్మన్ 2 అంజమ్మ శ్రీనివాసులు, గుంటక వెంకటరెడ్డి, కౌన్సిలర్లు, డాక్టర్ సీహెచ్ కనకదుర్గ, దొడ్డ భాగ్యలక్ష్మి, హర్షిత, నాగ అరుణ, సిరాజ్, కొత్త కృష్ణ, బుశ్శెట్టి నాగేశ్వరరావు, చంద్ర, కశ్శెట్టి నగేష్, ఉత్తమ్ కుమార్, మారంరెడ్డి లతతోపాటు పార్టీ మహిళా కార్యదర్శి కంది ప్రమీలారెడ్డి, కాల్వ దుర్గ, టౌన్ యూత్ అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమి కమిటీలతో టీడీపీ దోపిడీ

- పాకలలో టీడీపీకి భారీ షాక్
- మంత్రి సమక్షంలో 150 మంది చేరిక
- పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన మంత్రి సురేష్

సింగరాయకొండ(మర్రిపూడి): టీడీపీపై నమ్మకం లేదని ఆ పార్టీని వీడి పలు కుటుంబాలు వైఎస్సార్ సీపీ కండువాలు కప్పుకుంటున్నాయని, సింగరాయకొండ, టంగుటూరు మండలాల్లో పార్టీలో చేరికలు బాగా పెరిగాయని కొండపి అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పాకల టీడీపీ సానుభూతిపరులుగా ఉన్న 30 కుటుంబాలకు చెందిన 150 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి మంత్రి సురేష్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ గత రెండు రోజుల్లో పాకల నుంచి 150 మంది, టంగుటూరు నుంచి 21 కుటుంబాల వారు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారన్నారు. గతంలో టీడీపీ హయాంలో పేదలకు సంక్షేమ పథకాలు అందక జన్మభూమి కమిటీలు నిత్యం అడ్డుపడి దోచుకున్నారని ఆరోపించారు. జగనన్న ప్రభుత్వంలో వలంటీర్ల సహకారంతో రాజకీయాలకు, నాయకులకు సంబంధం లేకుండా నేరుగా పేదలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం వైఎస్సార్ సీపీ పనిచేసిందని గతంలో టీడీపీ కారణంగా రాష్ట్రం చిన్నా భిన్నమైందని ఆరోపించారు. పెత్తందార్ల టీడీపీ పాలనలో ఉండలేమని ఆ పార్టీ నాయకులు వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారన్నారు. సోమవారం జరిగే ఎన్నికల్లో ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, డాక్టర్ ఆదిమూలపు సురేష్‌లను ఫ్యాన్ గుర్తు పై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పాకల గ్రామ కమిటీ అధ్యక్షుడు కేశవరపు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సింగరాయకొండ: వైఎస్సార్ సీపీలో చేరిన పాకల వాసులు

గ్రానైట్ ఖిల్లాలో..

అభివృద్ధి వెలుగులు

గెలాక్సీ గిరిగా పేరొందిన చీమకుర్తిలో ఐదేళ్ల వైఎస్సార్ సీపీ హయాంలో అభివృద్ధి వెలుగులు విరజిమ్మాయి. నగర పంచాయతీ నుంచి గ్రేడ్–2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ కావడంతో పాటు కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారు. రోడ్లు, డ్రైన్లు, ఆస్పత్రులు, జిమ్‌లు ఏర్పాటయ్యాయి. కేవీపాలెం రోడ్డు, పాటిమీద పాలెం రోడ్డు, నాయుడుపాలెం రోడ్డులో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీలు పూర్తయితే పట్టణ వెలుగులు మరింత విస్తరించనున్నాయి.

- రూ.20 కోట్లపైనే అభివృద్ధి పనులు
- దాదాపు రూ.3 కోట్లతో నూతన మున్సిపల్ భవనం నిర్మాణం
- రూ.15 కోట్లతో రోడ్లు, కాలువల అభివృద్ధి
- జగనన్న మూడు కాలనీలు, సంక్షేమ పథకాలకు మరో రూ.300 కోట్ల పైనే


చీమకుర్తి మున్సిపల్ కార్యాలయం నూతన భవనం

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రానైట్ గెలాక్సీ నగరమైన చీమకుర్తి మున్సిపాలిటీలో అభివృద్ధి వెలుగులు విరజిమ్ముతున్నాయి. కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారు. వాటితో పాటు మూడు జగనన్న కాలనీలు, సంక్షేమ పథకాలకు ప్రభుత్వం కేటాయించిన నిధులు మరో రూ.300 కోట్లపైనే.

రూ.కోటితో అర్బన్ క్లినిక్ నిర్మాణం

చీమకుర్తి పట్టణంలో నివాసం ఉంటున్న దాదాపు 40 వేల మంది ప్రజలకు వైద్య సదుపాయాలను కల్పించే నిమిత్తం కోటి రూపాయలతో అర్బన్ హెల్త్ క్లినిక్ భవనాన్ని నిర్మిస్తున్నారు. భవనం నిర్మాణం పూర్తయితే అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. సీహెచ్‌సీ ప్రభుత్వాసుపత్రిలో కూడా దాతలు సహకారం, ఇతర వనరుల సహకారంతో రోగులకు అవసరమైన వైద్యసేవలందించేందుకు కావాలసిన పరికరాలను సమకూర్చారు. దీంతో చీమకుర్తి పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాది మంది ప్రజలకు సీహెచ్‌సీలో నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు అవకాశం కలిగింది.

దాదాపు రూ.15 కోట్లతో సిమెంట్ రోడ్లు, సైడు కాలువలు

20వ వార్డులో సుమారు 1.50 కోట్ల వ్యయంతో సిమెంట్ రోడ్లు, సైడు కాలువలను నిర్మించారు. 17వ వార్డులోని కుమ్మరి పాలెం, బైపాస్ జంక్షన్ కేంద్రాలుగా, వాటి పరిధిలో రూ.2 కోట్ల వ్యయంతో సిమెంట్ రోడ్లు, సైడు కాలువలను నిర్మించారు. ఇలా చీమకుర్తి పట్టణంలోని 20 వార్డులలో ఆయా స్థానిక కౌన్సిలర్‌ల సహకారంతో రూ.15 కోట్లకు పైగా విలువ చేసే రోడ్లు కాలువలతో అభివృద్ధి పనులను చేపట్టారు.

రూ.36 లక్షలతో కేవీపాలెం రోడ్డు విస్తరణ

చీమకుర్తి మెయిన్‌రోడ్డు బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే వీ పాలెం రోడ్డు ఒకప్పుడు కనీసం 12 అడుగుల వెడల్పు కూడా లేకుండా ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. చీమకుర్తి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయిన తరువాత మున్సిపల్ జనరల్ ఫండ్ రూ.36 లక్షల వ్యయంతో రోడ్డును 32 అడుగుల వెడల్పును విస్తరించారు. దీంతో బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం, సబ్‌రిజిస్ట్రార్, జెడ్పీహెచ్‌ఎస్ గరల్స్ హైస్కూలు వంటి పలు ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాల వద్దకు నిత్యం రాకపోకలు సాగించే వందలాది మంది ప్రజలకు కేవీ పాలెం రోడ్డు ఎంతగానో తోడ్పడుతుంది.

రూ.62 కోట్లతో సురక్షిత సాగర్ నీటి సరఫరాకు ఏర్పాట్లు

చీమకుర్తి పట్టణంలోని 40 లక్షల మంది ప్రజలకు సురక్షితమైన సాగర్ నీటిని అందించేందుకు రామతీర్థం రిజర్వాయర్ నుంచి పట్టణ వాసులకు అందించేందుకు రూ.62 కోట్ల వ్యయంతో మూడు ఎస్ఎస్ ట్యాంకులను, పైప్ లైన్‌ల నిర్మాణాలను చేపట్టారు. ఈ పథకం త్వరలో పూర్తి కావస్తుందని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

రూ.2 కోట్లతో 7 ఎకరాల్లో చెత్త సంపద కేంద్రం

నాయుడుపాలెం రోడ్డులో రూ.2 కోట్ల వ్యయంతో మున్సిపాలిటీలో సేకరించిన చెత్తను నిల్వ చేసి దానిని రీసైకిలింగ్ నిమిత్తం సద్వినియోగం చేసుకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో ఏళ్ల తరబడి చీమకుర్తి శివారు ప్రాంతాల్లో చెత్త కాలుష్యంతో పడుతున్న ఇబ్బందులు తొలగినట్లయింది.

రూ.300 కోట్లతో జగనన్న సంక్షేమం, జగనన్న కాలనీలు

చీమకుర్తి పట్టణంలో స్థానిక పేద ప్రజల సౌకర్యార్థం కేవీ పాలెం రోడ్డులో, పాటిమీదపాలెం రోడ్డులో, నాయుడుపాలెం రోడ్డులో కలిపి మూడు జగనన్న కాలనీలను నిర్మించారు. వాటిలో సుమారు 1200 మందికి ఇంటి స్థలాలు ఇచ్చి ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షలు చొప్పున పక్కా గృహాలను ప్రభుత్వం నిర్మించింది. ఇవిగాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక వసతులతో నిర్మాణ పనులు జరిగాయి.


చీమకుర్తి బస్టాండ్ నుంచి కేవీపాలెం వెళ్లే రోడ్డు

రూ.9 లక్షల వ్యయంతో చిల్డ్రన్స్ ఓపెన్ జిమ్



బాలలకు ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్

పట్టణంలోని చిన్నారులకు శారీరక వ్యాయామం, ఎంటర్‌టైన్‌మెంట్ నిమిత్తం రూ.9 లక్షల వ్యయంతో 5వ సచివాలయం పక్కన తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా బాలల కోసం ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. దాని వలన నిత్యం బాలలు ఉత్సాహంగా వ్యాయామం చేయటంలో వారి తల్లిదండ్రులతో వచ్చి సంతోషంగా గడుపుతున్నారు.



నగర పంచాయతీ నుంచి గ్రేడ్-2 మున్సిపాలిటీగా


బూచేపల్లి చారిటబుల్ ట్రస్ట్ తరఫున నిర్మించిన ఆర్చి

2022 వరకు నగర పంచాయతీగా ఉన్న చీమకుర్తి ఆ తర్వాత గ్రేడ్–2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయింది. అప్పటి నుంచి ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు, మున్సిపాలిటీ జనరల్ ఫండ్, ఇతర ఆదాయ మార్గాల ద్వారా వచ్చిన వనరులతో స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్‌లు సహకారంతో చీమకుర్తి పట్టణాన్ని అభివృద్ధి పథంలో తీర్చిదిద్దారు. దానిలో భాగంగా సుమారు రూ.3 కోట్ల వ్యయంతో మున్సిపల్ కార్యాలయం నూతన భవనాన్ని అత్యంత సుందరగా నిర్మించారు. ప్రస్తుతం నూతన మున్సిపల్ కార్యాలయం భవనంలోనే సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల కార్యాకలాపాలను రిటర్నింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్ ఎన్నికల విధులను నిర్వహించేందుకు వినియోగిస్తున్నారు. నూతన భవనానికి జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, సుబ్బారెడ్డి ఛారిటబుల్ ట్రస్టు సహకారంతో సుందరంగా ఆర్చి నిర్మాణాన్ని రూపొందించారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: పోలింగ్ రోజున అసెంబ్లీ అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం ప్రకాశం భవనంలో అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 13వ తేదీ ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ సాగుతుందని, పోలింగ్ సమయం ముగిసేలోగా బూత్‌లో ఉన్న వారికి మాత్రమే ఓటు వేసే అవకాశం ఉంటుందన్నారు. గుర్తింపు కార్డులున్న వారినే పోలింగ్ బూత్‌లోకి అనుమతిస్తామన్నారు. రాజకీయ పార్టీలు ఏజెంట్లను నియమించుకోవాలని, పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలో స్లిప్పులు ఇచ్చే టెంట్లు వేసుకోవాలన్నారు. టెంట్లలో అభ్యర్థికి చెందిన బ్యానర్ అనుమతించిన సైజులోనే ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానం చేసామన్నారు. దొంగ ఓట్లు వేసేందుకు యత్నించినా, గొడవలకు పాల్పడినా కఠిన చర్యలుంటాయన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిసేందుకు సహకరించాలని కోరారు. సమావేశంలో డీఆర్‌ఓ శ్రీలత, పార్లమెంట్ ఏఆర్‌ఓ ఝాన్సీలక్ష్మి, ఎలక్షన్ సెల్ సూపరింటిండెంట్ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పక్కాగా పోలింగ్ సామగ్రి తరలింపు

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్, తరలింపులో ఎటువంటి లోపాలు లేకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు కచ్చితత్వం పాటించాలని రిసెప్షన్ కేంద్రాల్లో పనిచేసే అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. శుక్రవారం స్పందన భవనంలో ఎన్నికల అధికారులు, నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు లేఔట్‌తో సైన్ బోర్డులు, టేబుల్స్, కుర్చీలు, ఇతర ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసేలా ప్రత్యేక కేంద్రాన్ని అందుబాటులో ఉంచాలన్నారు. పోలింగ్ సామగ్రిని చెక్ లిస్ట్ ప్రకారం సిబ్బందికి అందజేయాలన్నారు.


రూ. 52 లక్షలతో పూర్తయిన గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్


కనిగిరి రెవెన్యూ కార్యాలయం

ప్రగతికి C/o కనిగిరి

అభివృద్ధి పనులపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చూపిన శ్రద్ధ కనిగిరి పట్టణాన్ని ప్రగతి పథంలో నిలిపింది. కనిగిరి నగర పంచాయతీని గ్రేడ్–2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయడంతో అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయి. కనిగిరి పట్టణాన్ని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించిన సీఎం వైఎస్ జగన్.. సమగ్ర రక్షిత మంచి నీటి పథకానికి రూ.130 కోట్లు కేటాయించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో కోట్లాది రూపాయలు వెచ్చించి సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించడంతో పాటు పాఠశాలల రూపురేఖలు మార్చారు.

- నగర పంచాయతీ నుంచి గ్రేడ్–2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్
- శరవేగంగా సాగుతున్న ఇంటింటికీ సాగర్ నీరు పనులు
- రూ.10.50 కోట్లకు పైగా వెచ్చించి రోడ్లు, డ్రెయిన్ల అభివృద్ధి
- మారిన కనిగిరి రూపురేఖలు

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కనిగిరి రెవెన్యూ డివిజన్ కేంద్రంగా మారడంతో అనేక ప్రభుత్వ ఉన్నత కార్యాలయాలు ప్రజల చెంతకు చేరాయి. దీంతో కనిగిరిలో భూములకు భారీ స్థాయిలో రెక్కలు వచ్చాయి. రెవెన్యూ డివిజన్ పరిధిలోని మిగతా మండలాల ప్రజల రాకపోకలు సాగుతుండటంతో వ్యాపారాలు పెరిగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు కనిగిరికి వచ్చి భూములు కొనుగోలు చేస్తున్నారు. రెవెన్యూ, వైద్య, విద్య, పోలీస్, మండల పరిషత్ సంబంధిత పనులన్నీ ఇక్కడే పూర్తవుతుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కనిగిరి పట్టణ జనాభా	52,135
మున్సిపాలిటీలోని వార్డులు	20
కనిగిరి పట్టణ విస్తీర్ణం	24.5 చదరపు కిలోమీటర్లు
కనిగిరిలో మొత్తం ఓట్లు	34,500

మౌలిక వసతులకు పెద్దపీట

కనిగిరిని గ్రేడ్ 2 మున్సిపాలిటీగా మారుస్తూ 2022 జూలైలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి నుంచి కనిగిరి పట్టణం అభివృద్ధిలో మరింత ముందడుగు వేసింది. మున్సిపాలిటీ హోదాతో వివిధ శాఖల పోస్టులు పెరగడంతో పాటు ప్రత్యేక నిధులు వచ్చాయి. పట్టణంలో గత ఏడాది సెప్టెంబర్ నాటికి 11 కిలోమీటర్ల మేర 93 రోడ్లను రూ.8.73 కోట్లతో అభివృద్ధి చేశారు. 16 కిలోమీటర్ల మేర సీసీ డ్రెయిన్లను రూ.4 కోట్లతో చేపట్టారు. రూ.130 కోట్లతో సమగ్ర కనిగిరి రక్షిత మంచి నీటి పథకం(ఇంటింటికి సాగర్ నల్లా) పనులు పురోగతిలో ఉన్నాయి. రూ.48 లక్షలతో పైప్‌లైన్ పనులు పూర్తయ్యాయి.

విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ

- నాడు–నేడు మొదటి విడతలో రూ.3.18 కోట్లతో 5 పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తయ్యాయి.
- నాడు–నేడు రెండో విడతలో రూ.2 కోట్లు మంజూరు కాగా 15 పాఠశాలల అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయి.
- రూ.1.60 కోట్లతో నేషల్ హెల్త్ మిషన్ గ్రాంట్ ద్వారా రెండు డాక్టర్ వైఎస్సార్ ప్రైమరీ అర్బన్ హెల్త్ సెంటర్లు మంజూరయ్యాయి. అందులో రూ.90 లక్షలతో ఒకటి పూర్తి కాగా మరొకటి పురోగతిలో ఉంది.

ఇతర అభివృద్ధి పనులు

- రూ.1.04 కోట్లతో అమృత్ 2.0 పథకం కింద 15వ ఆర్థిక నిధులు దొరువు అభివృద్ధికి మంజూరు కాగా మొదటి విడతగా రూ.56.5లక్షలతో ఆంధ్రప్రదేశ్ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ వారి పర్యవేక్షణలో పనులు పురోగతిలో ఉన్నాయి.
- రూ.52 లక్షలతో గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ పనులు పూర్తయ్యాయి.
- కనిగిరి పట్టణంలో విలీన గ్రామాలైన కాశీపురం, కాశిరెడ్డి కాలనీ, చింతలపాలెం, శంఖవరంలో ఆర్డీఎస్ఎస్ స్కీం నిధులు రూ.4 కోట్లతో 24 గంటల విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు పనులు పూర్తి చేశారు.

నెరవేరిన సొంతింటి కల

- పట్టణంలోని గార్లపేట రోడ్డులో ఉన్న ఆదర్శ కాలనీలో 1091 గృహాలు మంజూరు కాగా అందులో సుమారు 115 ఇళ్లు పూర్తయ్యాయి. వీటికి సబంధించి రూ.కోటి నగదు లబ్ధిదారులకు చెల్లించారు.
- వ్యక్తిగత గృహ లబ్ధిదారులకు 1,016 గృహాలు మంజూరు కాగా అందులో 800 గృహాలు పూర్తి కాగా వాటికి సంబంధించి సుమారు రూ.8 కోట్ల నగదు లబ్ధిదారులకు చెల్లించారు.


సీసీ రోడ్ల అభివృద్ధి


పూర్తయిన అర్బన్ హెల్త్ కేంద్రం

దశ..దిశ మారిన గిద్దలూరు!

గిద్దలూరు నగర పంచాయతీ అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక పట్టణంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు జరిగాయి. పట్టణ వాసుల దాహార్తి శాశ్వతంగా తీర్చేందుకు ప్రభుత్వం 140 కోట్ల రూపాయలు మంజూరు చేసింది. ఇప్పటికే పైప్‌లైన్ పనులు ప్రారంభించారు. 7 లక్ష లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం గల ట్యాంకులు 7 నిర్మించి అందులో నింపిన నీటిని గిద్దలూరుకు సరఫరా చేయాల్సి ఉంటుంది.



వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్ సెంటర్

- అభివృద్ధి పథంలో గిద్దలూరు నగర పంచాయతీ
- కోట్ల రూపాయలతో తాగునీటి సమస్యకు పరిష్కారం
- సీసీ రోడ్లు, డ్రైనేజీలకు మహర్దశ
- పేదల కోసం ఆరోగ్య కేంద్రాలు
- నాడు–నేడు కింద రూపు మారిన ప్రభుత్వ పాఠశాలలు

గిద్దలూరు రూరల్:

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో గిద్దలూరు నగర పంచాయతీ అభివృద్ధి పథంలో పరుగులు పెడుతోంది. నగర పంచాయతీ అభివృద్ధిపై జగనన్న ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. నగర పంచాయతీలో ప్రధానంగా తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు శాశ్వత నీటి పరిష్కారం కోసం ఏఐబీ పథకం కింద రూ.140 కోట్లు మంజూరు చేసింది. అందుకు గాను పనులు త్వరితగతిన పూర్తి కానున్నాయి. గొట్టిపడియ నుంచి గిద్దలూరుకు పైపులైను ద్వారా నీరు తెప్పించి నీటి సమస్యను పరిష్కరించుకునేందుకు పనులు ప్రారంభించారు. 60 కిలో మీటర్ల మేర పైపు లైను వేయాల్సి ఉండగా 20 కిలో మీటర్లు పైపు లైను ఇప్పటికే పూర్తి చేశారు. 7 లక్ష లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం గల ట్యాంకులు 7 నిర్మించి అందులో నింపిన నీటిని గిద్దలూరుకు సరఫరా చేయాల్సి ఉంటుంది. ట్యాంకులు రెండు పూర్తి కానున్నాయి.

సీసీ రోడ్ల కోసం కోట్ల రూపాయల ఖర్చు

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని సత్వరమే పరిష్కరించేందు కోసం నగర పంచాయతీలోని 20 వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల అభివృద్ధి కోసం రూ.2 కోట్లు మంజూరు చేసి పనులు పూర్తి చేశారు. పేద ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ జగనన్న ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేసింది. అందులో భాగంగానే నంద్యాల రోడ్డులోని పాత మలేరియా వైద్యశాల ఆవరణలో వైఎస్సార్ హెల్త్ క్లీనిక్ సెంటర్, టిడ్కో గృహాల సమీపంలో జగనన్న కాలనీలోని హెల్త్ క్లీనిక్ సెంటర్ రెండికి కలిపి రూ.2.30 కోట్లు నిధులు మంజూరు చేసి భవనాలను అత్యాధునికంగా నిర్మించారు. పట్టణం నడిబొడ్డులో ఉన్న కాశిరెడ్డి నాయన కుంట దుర్గంధంతో నిరుపయోగంగా ఉండటం గమనించి దేశ రక్షణలో భాగస్వాములుగా నిలిచిన అమరవీరుల జ్ఞాపకార్థం కాశిరెడ్డినాయన అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగానే అమృత్ సర్ 2.0 పథకం కింద రూ.56 లక్షలు మంజూరు చేశారు. పనులు కొంత మేర జరిగాయి. ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి.


61 పనులకు నిధులు మంజూరు

15వ ఆర్థిక సంఘం నిధుల కింద 61 పనులు సుమారు రూ.10 కోట్ల నిధులు మంజూరు చేశారు. అందులో రెండు హెల్త్ క్లీనిక్ సెంటర్ భవనాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, జీటీఎస్ (చెత్త సేకరణ నిల్వ కేంద్రం), బిన్స్ (బకెట్లు) వంటి అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీ నిధుల కింద పట్టణంలోని సీఎస్ఐ చర్చి గేటు వద్ద నుంచి సీసీ రోడ్డు, శ్మశాన వాటిక అభివృద్ధి కోసం రూ.17 లక్షలు నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేశారు. విద్యకు పెద్ద పీట వేస్తూ విద్యారంగంలో అనూహ్యమైన మార్పులు తీసుకొచ్చారు. శిథిలావస్థకు చేరుకున్న పాడుబడిన స్కూల్స్‌ను నాడు–నేడు కింద మొత్తం 8 పాఠశాలలను రూ.3.3 కోట్ల నిధులతో అధునాతంగా మార్చారు. పేదవారికి ఇచ్చిన పక్కా గృహాలకు సంబంధించిన జగనన్న లే ఔట్లకు ప్రత్యేక నిధులు విడుదల చేశారు. నగర పంచాయతీ పరిధిలో రాజానగర్, కొండపేట, నల్లబండ బజారు, నంద్యాల రోడ్డులోని జగనన్న లేఔట్లు మొత్తం నాలుగు లే ఔట్లలో మొత్తం సుమారు 1400 మందికి నివాస గృహాలు నిర్మించుకున్నారు. జగనన్న కాలనీల అభివృద్ధి కోసం కోసం రూ.2 కోట్లు మంజూరయ్యాయి. పనుల కోసం టెండర్లు పిలిచారు.


రూ.56 లక్షలతో నిర్మించిన జీటీఎస్ కేంద్రం


డ్రెయినేజీ, సీసీ రోడ్డు


గుండ్లమోటు వద్ద నిర్మించిన నీటి ట్యాంకు


ఏఐబీ పథకంలో రూ.140 కోట్లతో నిర్మిస్తున్న మంచినీటి పథకంలో ఒక ట్యాంక్..


17వ వార్డులో నిర్మించిన సీసీ రోడ్డు